ప్రజాశక్తి

శనివారం 24 డిసెంబర్ 2022

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉద్యమాలకు దిక్సూచిగా.. కార్మిక ఐక్యత దిశగా ..

◆ ముగిసిన సిఐటియు విశాఖ జిల్లా 12వ మహాసభ

◆ కార్యదర్శి నివేదికపై సుదీర్ఘ చర్చలు ◆ 36 తీర్మానాలు ఆమోదం



మాట్లాడుతున్న కుమార్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉద్యమాలకు దిక్సూచిగా.. కార్మిక ఐక్యత దిశగా.. సిఐటియు విశాఖ జిల్లా 12వ మహాసభ సాగింది. కనీస వేతనాలకు నోచుకోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల హక్కులపై ప్రభుత్వ విధానాల దాడికి వ్యతిరేకంగా కార్మిక ఐక్యతే లక్ష్యంగా.. భవిష్యత్తు పోరాటాలకు దిక్సూచిగా సిఐటియుని మరింత బలోపేతం చేసేందుకు మహాసభలో ప్రతినిధులు రెండు రోజుల పాటు చర్చలు చేశారు. 36 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తొలిరోజు పవేశపెట్టిన నివేదికపై పతినిధులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఆర్‌పి.రాజు నగర్ (అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం)లో జరిగిన ఈ సభల్లో రెండు రోజుల పాటు జరిగిన సభలు, చర్చల్లో కార్యదర్శి నివేదికపై గోపాలపట్నం జోన్ నుంచి అనసూయ, గాజువాక నుంచి శ్రీను, మల్కాపురం నుంచి సురేష్, అక్కయ్యపాలెం నుంచి యుఎస్ఎన్ రాజు, పెందుర్తి నుంచి శంకరరావు, కంచరపాలెం నుంచి సింహాచలం, మధురవాడ నుంచి కొండమ్మ, ఆరిలోవ నుంచి ఐసి.నాయుడు, మద్దిలపాలెం నుంచి పి.వెంకటరావు జగదాంబ జోన్ నుంచి మీసాల హరి, భీమిలి నుంచి రవ్వ నరసింగరావు, స్టీల్ జోన్ నుంచి అప్పలరాజు, హెచ్‌పిసిఎల్ నుంచి సత్యనారాయణ, హైర్ బస్సు, ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ యూనియన్ నుంచి తులసీరామ్, మిడ్డే మీల్స్ నుంచి రాంబాయి, పెన్షనర్ల అసోసియేషన్ నుంచి సుధాకర్ తదితరులు మిగతా 2లో..



మహాసభలో తీర్మానాలను చేతులెత్తి ఆమోదిస్తున్న ప్రతినిధులు

చంద్రబాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరు

రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్



మాట్లాడుతున్న అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఏ రాష్ట్రానికి ప్రతిపక్ష నాయకుడో అర్థం కావడం లేదని ఎపి ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రోజుకో ప్రాంతానికి వెళ్లి అర్థం పర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన మూడున్నర సంవత్సరాలలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూస్తున్న జనం చంద్రబాబు నాయుడు చెప్పే మాటలను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. టిడిపి నేతలు కూడా చంద్రబాబు నాయకత్వాన్ని విశ్వసించడం లేదని అన్నారు. దీంతో అయోమయంలో పడ్డ చంద్రబాబు నాయుడు బిజెపితో సహా పలు పార్టీలను కలుపుకుపోవడానికి, వారిని నమ్మించేందుకు తన నటనా చతుర్యాన్ని ప్రదర్శిస్తున్నారని అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. మతిస్థిమితం లేని నాయకుని వెంట ఉన్న వారిని కూడా పిచ్చి వాళ్లనే అనాల్సి ఉంటుందన్నారు. కొద్దిరోజుల కిందట హైదరాబాదులోని ఎన్‌టిఆర్ భవన్‌కి బూజులు దులిపి తాను తెలంగాణలోనే ఉంటున్నానని, తెలుగుదేశానికి పుట్టినిల్లు తెలంగాణయే అని చంద్రబాబు నాయుడు చెప్పడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలని అమర్‌నాథ్ ప్రశ్నించారు. చంద్రబాబు ఖమ్మం వెళ్లి ఇది నా గుమ్మం అంటాడు.. మరి కుప్పం ఏమిటని అడిగారు. ఉత్తరాంధ్రకు ఏమాత్రమూ మేలు చేయని చంద్రబాబుకు ఈ ప్రాంతంలో అడుగుపెట్టే హక్కు లేదని అమర్‌నాథ్ అన్నారు. దేశంలోనే పేరెన్నికగన్న విశాఖ నగరాన్ని పరిపాలనా రాజధానిగా చేయాలని అసెంబ్లీలో తీర్మానించి ఆ దిశగా అడుగులు ముందుకు వేస్తున్నామని, చంద్రబాబు అడుగడుగునా అడ్డుపడుతున్నారని తెలిపారు. వచ్చే నాలుగు నెలల్లో విశాఖలో అంతర్జాతీయ సదస్సులు, సమ్మేళనాలు జరగబోతున్నాయని అన్నారు. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియాను ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలో రూ.1900 కోట్లతో నెలకొల్పనున్నట్టు వెల్లడించారు.

లండగరువులో యువకుడు దారుణహత్య

▶ వార్త 3లో..

భీమిలి జోన్‌లో పించన్లకు మంగళం

▶ వార్త 3లో..

చెత్తపన్నుపై సిబ్బందిని ఉసిగొల్పడం తగదు

▶ వార్త 8లో..



ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రజని

క్రెడాయ్ ఎక్స్‌పో ప్రారంభం

ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి రజని వార్త మెయిన్‌లో..

సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన

విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రజలకు మంచి పరిపాలన అందించడంలో సచివాలయ వ్యవస్థ ముందుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుడ్ గవర్నన్స్ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు సుపరిపాలన వారాన్ని పాటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పబ్లిక్ సర్వీస్ డెలివరీ, ఆరోగ్యం, విద్య, గ్రీవెన్స్ సర్వీసులు, ప్రభుత్వ కార్యాలయాలలో సుపరిపాలనపై జిల్లా, మండల స్థాయిలో డిస్సెమినేషన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో సచివాలయ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. సచివాలయాల ద్వారా గ్రామ స్థాయిలోనే ఎపి సేవల పోర్టల్ ద్వారా ప్రజలకు కావలసిన సమస్త సేవలు పారదర్శకంగా అందిస్తున్నామని, దీని వల్ల మండల స్థాయి కార్యాలయాలపై పని భారం తగ్గి, మరింత మెరుగైన సేవలు ప్రజలకు అందించేందుకు సమయం చేకూరిందని అన్నారు. సచివాలయాల ద్వారా రైతులకు కావలసిన సేవలు కూడా అందుతున్నాయని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు కావలసిన సేవలు అందించడానికి ప్రభుత్వ శాఖల పనితీరు మార్చుకోవాలని అన్నారు. ప్రజా ప్రయోజనాల నిమిత్తం సేకరించిన భూమిని అభివృద్ధి చేసి పేదలకు ఇళ్లు కట్టుకునేందుకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఉద్యమాలకు దిక్సూచిగా.. కార్మిక ఐక్యత దిశగా..



సాహార్ద్ర సందేశమిస్తున్న కోటేశ్వరరావు

ప్రజంటేషన్స్ ఇచ్చారు.

రెండో రోజు శుక్రవారం మహాసభలో సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు సౌహార్ద్ర సందేశాన్నిచ్చారు. మోడీ ప్రభుత్వం దేశభక్తి పేరుతో దేశ ఆర్థిక వ్యవస్థను, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతోందని, వీటిని కాపాడే నిజమైన దేశ భక్తులుగా కార్మికులే పోరాటాలు సాగిస్తున్నారని ఉద్ఘాటించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యాక్టరీలు, ఫార్మా సంస్థల్లో నిరంతరం ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు పోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలకులకు పట్టడం లేదన్నారు. బ్రాండిక్స్ ప్రమాదంపై కమిటీ వేసినా నివేదికను ఇంతవరకూ బయటపెట్టకపోవడం.. కార్మికుల ప్రాణాలంటే పాలకులకు లెక్కలేనితనాన్ని సూచిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీస వేతనానికి నోచుకోక లక్షల కార్మిక కుటుంబాలు జీవనం సాగించలేని స్థితిలో నెట్టుకుంటూ వస్తున్నాయన్నారు.

నిరవధిక సమ్మెలకు కార్మికవర్గం సిద్ధం కావాలి : ఆర్‌కెఎస్‌వి.కుమార్

విశాఖ కేంద్రంగా 22, 23 తేదీల్లో జరిగిన సిఐటియు 12వ జిల్లా మహాసభలు రాబోయే మూడేళ్ల పోరాటాలకు దిశానిర్దేశం కానున్నాయని ఆ సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ వెల్లడించారు. సమ్మెలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం (ఎవికె)లో సంఘం జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, జిల్లా కోశాధికారి జ్యోతీశ్వరరావులతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 వేల మంది కార్మికులకు ప్రాతినిథ్యం వహించేలాగ 300 మందికిపైగా వివిధ కార్మిక రంగాలు, సంఘాల నుంచి ప్రతినిధులు ఈ సభల్లో పాల్గొన్నారని, రెండు రోజుల పాటు వివిధ కార్మిక సమస్యలపై చర్చలు జరిపారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రధానిగా వచ్చాక కార్మిక హక్కులపై తీవ్రంగా దాడి చేస్తున్నారని, లేబర్ కోడ్‌లు తెచ్చి యాజమాన్యాలకు వత్తాసు పలుకుతూ కార్మికులకు నష్టం తెచ్చే విధానాన్ని తీసుకొచ్చారని అన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ స్కీం (ఎన్‌ఎంపిఎస్)ను దేశంపై రుద్దుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నిటినీ ప్రైవేటీకరించారని, జాతీయ రహదారులపై టోల్‌గేట్ ఛార్జీలతో బాదుడు ప్రారంభించారని అన్నారు. ఈ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై పెట్టుబడిదారులు, పరిశ్రమల అధిపతుల దోపిడీకి ఆలవాలంగా మారిందన్నారు. మోడీ దుర్మార్గ విధానాలపై భవిష్యత్తులో ప్రజలు, కార్మికులు నిరవధిక సమ్మెలకు సిద్ధమైనా ఆశ్చర్యం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో కార్మిక సమస్యల పరిష్కారం అజెండాతో పార్టీలు రావాలని పిలుపునిచ్చారు. సమాన పనికి సమాన వేతనం అన్న సుప్రీం కోర్టు తీర్పును సైతం ఎక్కడా యాజమాన్యాలు అమలు చేయడం లేదన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు నెలకు రూ.4500 నుంచి రూ.11 వేలు వరకూ మాత్రమే చెల్లిస్తున్నారని, ఈ వేతనంతో కుటుంబ పోషణ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. రైతు వ్యతిరేక చట్టాలను మోడీ తీసుకొచ్చినప్పుడు రైతాంగం తిరగబడి వాటిని ఎలాగైతే రద్దు చేయించుకున్నారో లేబర్ కోడ్స్‌పైనా అలాంటి పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. సంఘం రాష్ట్ర మహాసభలు 2023 జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరుగనున్నాయని, ఈలోగా రాష్ట్ర కార్మిక జాతాలు మూడు ప్రాంతాల నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఇచ్ఛాపురం నుంచి విశాఖకు ఒక జాతా 28న ఇచ్ఛాపురంలో ప్రారంభమై 29న విశాఖకు వస్తుందన్నారు. దీనికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు సారథ్యం వహిస్తారన్నారు. మిగతా రెండు జాతాల్లో ఒకటి కుప్పం నుంచి భీమవరానికి, మరొకటి హిందూపురం నుంచి భీమవరానికి రానున్నాయన్నారు. వీటికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్, ఉమామహేశ్వరరావు సారథ్యం వహిస్తారని తెలిపారు

సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన

పంపిణీ చేస్తున్నామన్నారు. డెవలప్‌మెంటుకు కూడా పూలింగు ద్వారానే నిధులు సమకూర్చుకొంటున్నట్లు తెలిపారు. పారదర్శకంగా భూముల రీసర్వే ప్రక్రియ చేపట్టినట్లు చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ మాట్లాడుతూ విద్యాశాఖ ద్వారా పారదర్శక, సుపరిపాలన అందించేందుకు చేపట్టిన సంస్కరణలు, వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. జిల్లా సర్వేయరు చంద్రశేఖర్ మాట్లాడుతూ సర్వే విధానాన్ని తెలిపారు. రికార్డుల స్వచ్ఛీకరణ చేస్తున్నామని అన్నారు. జివిఎంసి, వైద్య శాఖల అధికారులు వారి శాఖల్లో అమలు చేస్తున్న పరిపాలన విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, అదనపు జిల్లా ఇన్వర్వేటిక్స్ అధికారి ఎస్‌హెచ్.పాషా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగానే లక్ష్మీనారాయణ పోటీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ 2024లో జరుగునున్న ఎన్నికల్లో విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారని జెడి ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ జగన్ మురారి తెలిపారు. జెడి ఫౌండేషన్ సభ్యులు, సన్నిహితుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని మీడియాకు తెలిపారు. అనేక పార్టీలు ఆహ్వానం పలికినప్పటికీ, సిద్ధాంతాలు కలవకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. విశాఖ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జెడి ఫౌండేషన్ కన్వీనర్ ప్రియాంక దండి పోటీ చేస్తారని తెలిపారు.

గ్లోబల్ హెల్త్ సమ్మిట్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వచ్చే ఏడాది జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు విశాఖపట్నంలో అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ నిర్వహిస్తున్న గ్లోబల్ హెల్త్ సమ్మిట్ బ్రోచర్‌ను శుక్రవారం ప్రభుత్వ అతిథి గృహంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ఛైర్మన్, రిటైర్డ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ టి.రవిరాజు, సమ్మిట్ కో- ఛైర్మన్ డాక్టర్ టి.రాధ పాల్గొన్నారు. గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌కు హాజరు కావాలని మంత్రి రజినిని డాక్టర్ రవిరాజు, డాక్టర్ రాధ దంపతులు ఆహ్వానించగా అందుకు మంత్రి అంగీకరించారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమం ఉధృతం



నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, ప్రైవేటీకరణ చేయరాదని అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నామని జెఎసి నాయకులు, స్టీల్‌ప్లాంట్‌లోని హెచ్‌ఎంఎస్ యూనియన్ అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు తెలిపారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 631వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌ఎంఎస్ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 27న అన్ని పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్ని పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీ యాత్రకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. దీక్షల్లో పాల్గొన్న వారిలో ఉపాధ్యక్షులు జి.అప్పలరాజు, గొడ్డు రమణ, జి.సత్యారావు, జి.అప్పల నాయుడు, శ్రీరాములు, ఎన్.లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య కార్యక్రమాలతో మేలు



మాట్లాడుతున్న శ్రీధర్ రెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డిపార్టుమెంట్, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ జనరేషన్ అండ్ ఎంటర్ప్రైజ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిడియుజికెవై, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు యువతకు అన్ని రకాలుగా ఉపయోగపడుతున్నాయని ఎపి ప్రభుత్వ సలహాదారు (స్కిల్ అండ్ జాబ్ ఫెయిర్) గాది శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 92 స్కిల్ ట్రైనింగ్ సెంటర్లలో 49124 మంది యువతకు 52 కోర్సుల్లో ఉచిత భోజన, వసతి సదుపాయాలతో శిక్షణ అందించి 28,219 మందికి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ప్రైజ్ డెవలప్‌మెంట్ ఎపి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.పార్థసారథి, జెడిఎం కల్యాణి పాల్గొన్నారు.

నేడు కంచి కామకోటి పీఠాధిపతి రాక

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి మహా స్వామి శనివారం విశాఖ వస్తున్నారని శంకర మఠం కార్యక్రమ అధ్యక్షులు డాక్టర్ టి.రవి రాజు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయేంద్ర సరస్వతి రాకను పురస్కరించుకొని పలు ప్రాంతాల్లో భారీగా స్వాగతాలు, శాంతిపురం నుంచి శంకరమఠం వరకు శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన శంకరమఠంలో విడిది చేస్తారని, ప్రతి రోజూ అభిషేకాలు,అర్చనలు, భక్తులకు ఉదయం, సాయంత్రం స్వామి దర్శనాలు ఉంటాయన్నారు. తొలుత అగనంపూడి వద్ద ఘన స్వాగత కార్యక్రమం ఉంటుందన్నారు.

సత్యనారాయణకు నివాళి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలని : సినీ నటుడు కైకాల సత్యనారాయణ ఆకస్మిక మృతికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ తీవ్ర సంతాపం తెలిపింది. ఆయనకు సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఘన నివాళ్లర్పించారు. సుమారు 700 సినిమాల్లో నటించి, అన్ని పాత్రలతో తెలుగు ప్రేక్షకులను సత్యనారాయణ మెప్పించారని తెలిపారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు ఎయు మానవ వనరుల అభివృద్ధి శాఖ కేంద్రంలో సంతాప సభ నిర్వహిస్తామని వెల్లడించారు.

పవన్ రాజకీయ గజిని



మాట్లాడుతున్న కొండా రాజీవ్ గాంధీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఓ రాజకీయ గజిని అని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎయుపై పవన్ కల్యాణ్ చేసిన విమర్శలను ఖండించారు. ఎయులో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను విద్యార్థులు నిర్వహిస్తే పవన్ కల్యాణ్‌కు వచ్చిన నొప్పి ఏంటని ప్రశ్నించారు. గతంలో పవన్ జన్మదిన వేడుకలను ఎయులో నిర్వహించినప్పుడు తాము ఏమైనా రాజకీయం చేశామా అని ప్రశ్నించారు. పవన్ గతం మర్చిపోయి ఒక రాజకీయ గజినీలా తయారయ్యారన్నారు. పవన్ ప్యాకేజీ మనిషని విమర్శించారు. సమావేశంలో కిల్లాన్ హేమంత్ కుమార్, పటిబండ్ల లిఖిత, పెన్నిపాటి నవీన్, వెంకట్, సందీప్, సూర్య, విజయ్, దినేష్ పాల్గొన్నారు.

బోధనపై శిక్షణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కంప్యూటర్, ఇంగ్లీష్ బోధనపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి బి.భాను ఫణీంద్ర తెలిపారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. 45 రోజులపాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ విద్యార్థినిలకు మాత్రమే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ద్వారకా నగర్, శ్రీనగర్ కాలనీలోగల మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ కార్యాలయంలో ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8019218586, 8374970219, 9392087139 నెంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులు స్వర్ణలత, యజ్ఞ ప్రియాంక పాల్గొన్నారు.

పింఛన్లకు మంగళం..?

- ▸▸ భీమిలి జోన్‌లో 955 పింఛన్ల కోత!
- ▸▸ ఆరు దశల్లో వడపోతతో తాత్కాలిక రద్దుకు సిద్ధం
- ▸▸ నోటీసుల జారీకి జివిఎంసి యుసిడి విభాగం రెడీ
- ▸▸ 15రోజుల్లో ఆధారాలు చూపకుంటే పెన్షన్ హుళక్కే

ప్రజాశక్తి -భీమునిపట్నం : వచ్చేనెల నుంచి సామాజిక పింఛను మొత్తాన్ని రూ.250 పెంచి,రూ.2,,750 లబ్ధిదారులకు ఇస్తామని ఒకవైపు ప్రకటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అదే సమయంలో ఆరు దశల్లో వడపోత ద్వారా అనేకమంది పింఛన్లుకు మంగళం పాడేందుకు సన్నద్ధమౌతోంది. ఒకవైపు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని అంటున్న సిఎం జగన్, ఇలా ఉన్న పింఛన్లను రద్దు చేయడమేంటని పలువురు ఆందోళన చెందుతున్నారు. తాజాగా వడపోత తర్వాత ఒకటో జోన్ పరిధిలో 955 పింఛన్లు రద్దయ్యాయి.

ఒకటోవార్డులోని ఐదు సచివాలయాల పరిధిలో 380 పింఛన్లు, రెండో వార్డు ఐదు సచివాలయాల పరిధిలో 284, మూడో వార్డు ఐదు సచివాలయాలలో 115, నాలుగో వార్డు ఆరు సచివాలయాల్లో 176 పింఛన్లు రద్దు కానున్నాయి. దీని ద్వారా ఒక్క భీమిలి జోన్‌లోనే నెలసరి రూ.23, 87,500 నగదును సర్కారు మిగిలించుకోనుంది. ఈ నాలుగు వార్డుల పరిధిలో ఇప్పటివరకు . 8,382 పింఛన్లు ఉండగా, ప్రతినెలారూ.2.15కోట్లను ప్రభుత్వం పింఛన్లుకు చెల్లిస్తోంది.


పింఛను రద్దుకు ఆరు దశల్లో వడపోత

పింఛన్ల రద్దుకు ఆరు దశల్లో వడపోత నిర్వహించినట్లు సమాచారం. అవి... వెయ్యి చదరపు అడుగుల ఇంటి విస్తీర్ణం, నెలసరి 300 యూనిట్లకుపైగా విద్యుత్ వాడకం, నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండడం, ఆదాయపన్ను చెల్లింపు, ఇంటిలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగి ఉండరాదన్న నిబంధన, ఐదు ఎకరాల పల్లం, పది ఎకరాల మెట్టు భూమి కలిగి ఉండడం,

15 రోజుల్లో వివరణకు నోటీసుల జారీ

ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అనర్హులుగా గుర్తించిన లబ్ధిదారులకు నోటీసులు జారీకి అధికారయంత్రాంగం సన్నద్ధమైంది. 15రోజుల్లో ఆమోదయోగ్యమైన వివరణ అందితే సరేసరి, లేకుంటే పింఛను హుష్‌కాకి. అధికారులు జారీకి సిద్ధం చేసిన నోటీసులోని అంశాలు యథాతథంగా..

'**మీ వ్యక్తిగత, కుటుంబ వివరాలు పరిశీలించిన మీదట జిఒఎంఎస్ 174, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, తేది13.12.2019 ప్రకారం పింఛను పొందేందుకు అనర్హులుగా గుర్తించడమైనది. మీ పింఛను తాత్కాలికంగా నిలుపుదల చేయడమైనది. నోటీసు అందిన 15 రోజుల్లోగా వివరణ రాత పూర్వకంగా కార్యాలయానికి అందజేయాలి. పింఛను అర్హతను తగు ఆధారాలతో నిరూపించుకోని యెడల మీ పింఛను శాశ్వతంగా రద్దు చేయబడుతుంది**' అంటూ పేర్కొన్న నోటీసుల జారీకి జివిఎంసి యుసిడి విభాగం సిద్ధమౌతోంది.


మున్సిపల్ కమీషనర్ గారి కార్యాలయము
భీమునిపట్నం (అర్బన్) మున్సిపాలిటి
విశాఖపట్నం జిల్లా
తేది : 21/12/2022

ఆర్.సి. నెం నోటి... పెంచన్ నెంబర్ : 103467469

నోటీసు

శ్రీ/శ్రీమతి/కుమారి : ... అను మీరు : 103467469 పెంచన్ నెంబర్ ద్వారా ... పింఛన్ ను ... వార్డు భీమునిపట్నం (అర్బన్) మునిసిపాలిటి, లో పొందుచున్నారు. మీ యొక్క వ్యక్తిగత/ కుటుంబ వివరాలను పరిశీలించిన పిదప .G.O.M No 174 పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ,తేది 13-12-2019 ప్రకారం మీరు ఈక్రింద పేర్కొన్న కారణాల వలన పింఛన్ కు అనర్హులుగా గుర్తించడమైనది .కావున మీ యొక్క పింఛన్ ను తాత్కాలికముగా నిలుపుదల చేయడమైనది.

పింఛను దారు / కుటుంబ సభ్యులు పట్టణ ప్రాంతములో 1000 చ.అ కన్నా ఎక్కువ నివేశ స్థలం కలిగి ఉన్నందువలన పింఛను పొందుటకు అర్హులు కారు

ఈ నోటీసు అందిన తేది నుండి 15 రోజులలో మీ యొక్క వివరణ ఈ కార్యాలయమునకు వ్రాత పూర్వకముగా తెలియజేస్తూ దానికి సంబంధించిన పత్రము సమర్పించవలసినదిగ కోరడమైనది. మీరు మీ పింఛన్ అర్హత ను తగు ఆధారములతో నిరూపించుకోని యెడల మీ పింఛన్ శాశ్వతముగా రద్దు చేయబడునని తెలియచేయడమైనది.

మున్సిపల్ కమీషనర్

టు
శ్రీ/శ్రీమతి/కుమారి : ...
... వార్డు వార్డు
(అర్బన్) మున్సిపాలిటి

CE SYSTEM GENERATED SIGNATURE NOT REQUIRED)

లబ్ధిదారులకు జారీకి యుసిడి అధికారులు సిద్ధం చేసిన నోటీసులు

ఆధారాలు చూపిస్తేనే పింఛను పునరుద్ధరణ



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పింఛన్ల అనర్హతపై లబ్ధిదారులకు నోటీసులు జారీ చేస్తున్నాం. నోటీసు ఇచ్చిన 15 రోజుల్లోగా పింఛను పొందేందుకు అర్హతలున్నట్లైతే నిర్దిష్ట కారణాలు, ఆధారాలతో కార్యాలయానికి వచ్చి రాతపూర్వకంగా తెలపాలి.అలా అయితే పింఛను పునరుద్ధరణ జరుగుతుంది.అంతవరకు తాత్కాలికంగా పింఛను నిలుపుదల చేస్తాం.

లంకాడ రాము, ఎపిడి,
యుసిడి విభాగం, భీమిలి జోన్

'కాపునాడును భ్రష్టు పట్టించొద్దు'

ప్రజాశక్తి- సీతమ్మధార : మూడు ముక్కల రాజకీయ క్రీడతో కాపు కులాన్ని, కాపునాడును భ్రష్టు పట్టించొద్దనిమాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును ఉద్దేశించి విశాఖ జిల్లా కాపునాడు అధ్యక్షులు తోట రాజీవ్ హెచ్చరించారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గంటా, తన ప్రాధాన్యతను పెంచుకోవడానికి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. కుల సంఘంలోని ఒక్కో నేతను పిలిచి, టిడిపి, వైసిపి, జనసేనలో టిక్కెట్ ఇప్పిస్తామని ఆశ చూపుతున్నారని, తాజాగా కాపుల్లో ఐక్యత లేదంటున్నారని ఆరోపించారు. కాపుల్లో ఐక్యత లేకుంటే నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎలా గెలిచారని ప్రశ్నించారు. వంగవీటి వర్ధంతి రోజున బహిరంగ సభ పేరుతో రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. తన వ్యక్తిగత లబ్ధి కోసం కాపు జాతిని గంటా అభాసుపాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రెండుసార్లు మంత్రిగా చేసిన గంటా, కాపుల కోసం చేసిందేమీ లేదన్నారు. ఉత్తర కాపునాడు అధ్యక్షులు గోలకూటి సుబ్బారావు మాట్లాడుతూ కాపు జాతి, కాపు నాడు కోసం మాట్లాడే అర్హత గంటాకు లేదన్నారు. కాపు నేత నక్క వెంకటరమణారావు పాల్గొన్నారు.

చెత్తపై యూజర్ ఛార్జీలు చెల్లించండి

ప్రజాశక్తి-మధురవాడ : చెత్తపై వేసిన యూజర్ చార్జెస్ చెల్లించి జివిఎంసి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జివిఎంసి రెండో జోన్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సూచించారు. శుక్రవారం వాంబేకాలనీలో డ్వాక్రా ఆర్‌పి ఆధ్వర్యంలో యూజర్ ఛార్జెస్, ఫ్రైడే డ్రైడేపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. ఇళ్లల్లో తడిపొడి చెత్తను వేరుచేసి ఇంటివద్దకే వచ్చే పారిశుధ్య వాహనానికి అందించాలని సూచించారు. ప్రతిశుక్రవారం డ్రైడే పాటించడం ద్వారా దోమలను నివారించి, తద్వారా వ్యాధులను అరికట్టవచ్చన్నారు.

ఆకట్టుకున్న వీధినాటిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్ ఆధ్వర్యంలో భీమిలిలో విశాఖ నగరానికి చెందిన భద్రం ఫౌండేషన్ కళాకారులు శుక్ర వారం 'ఆరోగ్యమే మహాభాగ్యం' వీధినాటికను ప్రదర్శించారు. కోవిడ్ ఫోర్త్‌వేవ్, బిఎస్-7 హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం చేయకుండా విధిగా మళ్లీ మాస్క్ వాడాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కళాప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాకారులు డేవిడ్‌రాజు, భవానీరాజు, చందు, విజయ్‌కుమార్, కె కుమారి, ఎస్ఒఎస్ ప్రోగ్రాం మేనేజర్ కె దుర్గరాజు, కో ఆర్డినేటర్ సత్యనారాయణ, యాని మేటర్లు సరళ, జానకి పాల్గొన్నారు.

పేదోడికి నాణ్యమైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం

ఆధునికీకరించిన పెందుర్తి సిహెచ్‌సి ప్రారంభోత్సవంలో మంత్రి రజని

రూ.20.50కోట్లతో పెందుర్తి :ప్రతి పేదవాడికీ నాణ్యమైన వైద్యం అందించే దిశగా సీఎం జగన్ కృషి చేస్తున్నారని ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. రూ.20.50కోట్లతో ఆధునికీకరించిన పెందుర్తి సిహెచ్‌సి, చినముషిడివాడలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సిఎం జగన్మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో వైద్యం కుంటిపడిందని, నేడు ఆసుపత్రులను అభివృద్ధి చేశామన్నారు. ఉగాదికి రాష్ట్రవ్యాప్తంగా ఫ్యామిలీ క్లినిక్ సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ విధానంలో డాక్టర్, వైద్యసిబ్బంది గ్రామాల్లో ప్రజల ఇళ్లకే వెళ్లి వైద్యసేవలు అందిస్తారని, పాఠశాలలు, అంగన్వాడీల్లోని విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేస్తారన్నారు కార్యక్రమంలో ఎంపిపి నాగమణి, ఆర్‌డిఒ హుస్సేన్, కలెక్టర్ మల్లికార్జున్, ఆర్డీవో హుస్సేన్,డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు, డిసిహెచ్ డాక్టర్ రమేష్‌కిషోర్ పాల్గొన్నారు


సిహెచ్‌సి ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రజని

బిడిఎస్ ఫలితాల్లో అనిల్ నీరుకొండ విద్యార్థుల సత్తా


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో సంస్థ సిఇఒ, ప్రిన్సిపల్

ప్రజాశక్తి-తగరపువలస : వైఎస్సార్ హెల్త్‌వర్సిటీ ఈనెల 22న విడుదల చేసిన ఫైనలియర్ బిడిఎస్ ఫలితాల్లో స్థానిక సంగివలసఅనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల విద్యార్థినులు భావన బన్సాలి, బి వందన సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో వరుసగా 84 శాతం, 82 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సంస్థ సిఇఒ నిరంజన్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, వరుసగా రెండోఏడాది రాష్ట్రస్థాయిలో తమ కాలేజీ విద్యార్థులు అధిక మార్కులు సాధించడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల కృషిని అభినందించారు.

సింహాచల దేవస్థానంలో ఉద్యోగాల పేరిట
బోగస్ నియామక పత్రాలు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచల దేవస్థానంలో ఎఇఒ ఆనంద్‌కుమార్ పేరిట బోగస్ ఉద్యోగ నియామక పత్రాలు ప్రత్యక్షమయ్యాయి. మెయింటెనెన్స్ సూపర్‌వైజర్ పోస్ట్‌కు మీసాల అప్పలరాజు అనే వ్యక్తికి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసి, వచ్చేనెల 4వ తేదీలోగా ఉద్యోగంలో చేరాలని జాబ్ కన్ఫర్మేషన్ లెటర్ హల్‌చల్ చేసింది.

ఈ ఉద్యోగ నియామకపత్రంపై అధికారి సంతకం లేకపోవడం గమనార్హం. ఇటువంటి బోగస్ నియామకపత్రాలతో నిరుద్యోగులను అయోమయం, అన్యాయానికి గురిచేసే చర్యలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. లేకుంటే ఇటువంటి బోగస్ నియామక పత్రాలు మరిన్ని వెలువడే అవకాశం ఉందని అంటున్నారు.

నేరాలు ఘోరాలు

లండగరువులో యువకుడు దారుణహత్య




రక్తపుమడుగులో నాగరాజు, కింద ఫైల్ ఫొటో

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలం దరి లండగరువు ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం లండ నాగరాజు (45) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. విషయం తెలిసిన గోపాలపట్నం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. డిసిపి ఆనందరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హతుడు లండ నాగరాజు నిరుద్యోగి. తన తండ్రితో పాటు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్యతో విడిపోయి వేరేగా ఉంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఓ జంట వారి ఇంటి ముందుగా వెళ్తుంటే, మద్యం మత్తులో వారితో గొడవపడ్డాడని, దీంతో వారు కర్రతో నాగరాజు బుర్రపై కొట్టడంతో గాయపడ్డారు. రక్తపు మడుగులో కొన ఊపిరితో ఉన్న నాగరాజును కెజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృత్యువాత పడినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే నిందితులు పరారయ్యారు.

ఉద్యోగాల పేరిట మోసం : కేసు నమోదు

ప్రజాశక్తి -మధురవాడ :పిఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సిఐ వై రామకృష్ణ తెలిపారు. ఐదో వార్డు బొరవానిపాలెం డ్రైవర్స్ కాలనీకి చెందిన ఎన్.శివాజీతో పాటు మరో వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తామని యువత నమ్మించి మోసం చేస్తున్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన నకిలీ ఐడీ కార్డులను సృష్టించి, ఆయా కార్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పలువురు వద్ద లక్షల్లో వసూలు చేశాడు. ఇలాగే మోసపోయిన మారికవలస కాలనీకి చెందిన టి.హరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పెద్ద బజారు, పిండి మిల్లు సమీపంలో తుక్కు దుకాణం వద్ద గురు వారం సాయంత్రం పేలుడు ఘటనలో గాయపడిన ఎగువపేటకు చెందిన ఉమ్మిడి రామస్వామి (55) కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు.దీనిపై ఎస్ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పేలుడుకు కారణాలను అన్వేషిస్తున్నారు.

సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో గంపవానిపాలెం శివారు అంట్లపాలెం గ్రామ సమీప అటవీ ప్రాంతంలో శుక్రవారం నాటు సారా తయారీకి సిద్ధం చేసిన సుమారు 600 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసినట్లు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. సుమారు ఆరు ప్లాస్టిక్ డ్రమ్ములలో నిల్వ చేసిన నాటు సారా పులుపును గుర్తించామన్నారు.

ఫిబ్రవరిలో సిఎం కప్ కరాటే పోటీలు


కప్‌ను ఆవిష్కరిస్తున్న రత్నాకర్

ప్రజాశక్తి- సీతమ్మధార : వచ్చే ఏడాది ఫిబ్రవరి 9 నుంచి 12 వరకు నాలుగు రోజులు పాటు విశాఖపట్నం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో సిఎం జగన్ కప్ పేరిట ఇంటర్నేషనల్ కరాటే పోటీలు నిర్వహించనున్నట్లు వైసిపి నేత, డైట్ చైర్మన్ దాడి రత్నాకర్ తెలిపారు. సీఎం కప్-2023ను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాలనా రాజధాని విశాఖలో నిర్వహించే కరాటే పోటీలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఇప్పటికే 10దేశాలు తమ పేర్లను నమోదు చేసుకున్నాయన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ సిఎం జగన్ కప్ కరాటే పోటీలను విజయవంతం చేయాలని కోరారు. పోటీల వివరాలను టోర్నీ నిర్వాహకుడు ఎస్‌పిఎండి నాయుడు వివరించారు. వర్ధమాన సినీ హీరో కంచర్ల ఉపేంద్ర, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి పాల్గొన్నారు.

త్రిఫ్ట్ సొసైటీ విద్యా ప్రోత్సాహకాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఉక్కునగరం : 2021-22 విద్యాసంవత్సరంలో అత్యధిక మార్కులు / ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించాలని త్రిఫ్ట్ సొసైటీ నిర్ణయించిందని సొసైటీ ఉపాధ్యక్షులు కె.ఆనందకుమార్, కార్యదర్శి డి.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 31లోగా నిర్దేశించిన దరఖాస్తులను సొసైటీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. శుక్రవారం ఉక్కునగరంలోని సొసైటీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, గడచిన విద్యాసంవత్సరంలో ఒబిసి కేటగిరీలోనూ బహుమతులను అందజేయాలని పాలకవర్గం నిర్ణయించిందన్నారు. టెన్త్, ఇంటర్ విద్యార్థులకు స్టేట్, సిబిఎస్ఇ సిలబస్‌లకు వేర్వేరు కేటగిరిగా పరిగణించి బహుమతు అందజేస్తామన్నారు. సొసైటీ సభ్యుల వికలాంగ పిల్లలకు ఆర్థికసాయానికి కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సొసైటీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. సమావేశంలో త్రిఫ్ట్ డైరెక్టర్లు కె.శ్రీనివాస్, ఎవి.రమణ, భూక్యా లాలూ, సొసైటీ సీనియర్ మేనేజర్ దామోదరరెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు వయో పరిమితి మూడేళ్లు పెంచాలి

ప్రజాశక్తి- మాధవధార : ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు వయో పరిమితి మూడేళ్లపాటు సడలింపు ఇవ్వాలని ఎపి స్టేట్ కాంగ్రెస్ ఒబిసి విభాగం ఛైర్మన్ మూల వెంకటరావు కోరారు. పోలీస్ యూనిఫామ్ వేసుకోవాలన్న లక్ష్యంతో కొన్నేళ్లుగా శిక్షణ పొందుతున్న వేలాదిమంది అభ్యర్థులు కొన్నిరోజులు, వారాలు, నెలల తేడాతో వయోపరిమితి కారణంగా ఉద్యోగాలకు అనర్హులుగా మారుతున్నారన్నారు. గతంలో నియామకాల్లో త్రుటిలో ఉద్యోగాన్ని దక్కించుకోలేని అనేకమంది, నాలుగేళ్ల తర్వాత ఇపుడు తాజా రిక్రూట్‌మెంట్‌లో వయస్సుతేడాతో అనర్హులుగా మారారన్నారు. దీనిపై ముఖ్యమంత్రి, హోంమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టి, పోలీస్ నియామకాలకు వయోపరిమితిని అన్ని వర్గాలకు మూడేళ్లు పెంచి న్యాయం చేయాలని కోరారు. తద్వారా వేలాదిమంది పోలీసు ఉద్యోగార్థుల ఆశలకు జీవం పోయాలని కోరారు.

ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవం



అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి -మధురవాడ : సిపిఐ 98వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మధురవాడ ఏరియా శివశక్తినగర్‌లో బి.కేశవయ్య, మళ్ళయ్యపాలెంలో కొల్లి మేఘారావు పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఏరియా కార్యదర్శి వి సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యురాలు ఎండి బేగం మాట్లాడుతూ సిపిఐ ఆవిర్భావం నుంచి రాజ్యాంగ పరిరక్షణకు, బడుగుల అభ్యున్నతికి పాటుపడుతోందన్నారు.బిజెపి మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయటానికి వామపక్ష నేతలు, ప్రజలు సన్నద్ధం కావాలనిపిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిపిఐ నాయకులు జి. వేంగనిరావు, ఎం సన్ని పాత్రుడు, సి డి ఆర్ రమణ, డి తిరుపతమ్మ, త్రినాథ్, రమణ, చిన్న, సూరిబాబు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో చైతన్య విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- గాజువాక : కోరమండల్ ఫెర్టిలైజర్స్ సిఎస్ఆర్ నిధులతో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో గాజువాక, శ్రీనగర్ చైతన్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. నగరంలోని ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన దాదాపు 2,500 మంది విద్యార్థులు హాజరుకాగా, చైతన్య పాఠశాల ఉత్తన పాఠశాల, ఉత్తమ ఉపాధ్యాయులు, ఉత్తమ సైన్స్ నమూనాల పురస్కారాలను కైవసం చేసుకున్నాయి. విజేతలకు పాఠశాలల ఆవరణలో కంపెనీ ప్రతినిధులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించి, అభినందించారు.పాఠశాల ప్రిన్సిపాల్ కామాక్షి, ఆర్‌ఐ.రమణ, కోఆర్డినేటర్ వెంకటరమణ, డీన్ అర్జున్, ఇన్‌ఛార్జి వెంకటప్పారావు పాల్గొన్నారు.

'ఉక్కు' రక్షణకు ఐక్య ఉద్యమాన్ని నిర్మిద్దాం

సిఐటియు విశాఖ జిల్లా మహాసభలో ఏకగ్రీవ తీర్మానం



తీర్మానాన్ని ప్రవేశపెడుతూ మాట్లాడుతున్న అయోధ్యరాం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను వందశాతం విక్రయించాలన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యూహాత్మక నిర్ణయానికి వ్యతిరేకంగా ఉక్కు రక్షణకు ఐక్య ఉద్యమాన్ని నిర్మిద్దామని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. నగరంలో జరుగుతున్న విశాఖ జిల్లా సిఐటియు12వ మహాసభ సందర్భంగా శుక్రవారం 'విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఐక్యఉద్యమాన్ని నిర్మిద్దాం" అన్న తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మహాసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా జె అయోధ్యరామ్ మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గడచిన ఎనిమిదేళ్లలో ఒక్క ప్రభుత్వరంగ పరిశ్రమను స్థాపించకపోగా, ఉన్న పరిశ్రమలను నిర్వీర్యం చేసి, తన తాబేదారులకు కట్టబెట్టే పనిని నిర్విరామంగా చేస్తోందని మండిపడ్డారు. అందులో భాగంగానే విశాఖ ఉక్కును వందశాతం వ్యూహాత్మక అమ్మకానికి పెట్టారన్నారు. దీనిపై కేంద్రం ప్రకటించిన నాటి నుంచి మిగిలిన కార్మిక సంఘాలను కలుపుకొని స్టీల్ సిఐటియు 680 రోజులుగా రిలే నిరాహార దీక్షలను చేస్తోందని గుర్తు చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అప్పులున్నాయే గానీ, నష్టాలు లేవని దీనికి ప్రధాన కారణం సొంతగనులు లేకపోవడమేనన్నారు. సొంత గనులున్న స్టీల్ ప్లాంట్లకు టన్ను ఇనుప ఖనిజం రూ.600లకే లభిస్తోందని, అయితే విశాఖ స్టీల్‌ప్లాంట్ మాత్రం బహిరంగమార్కెట్ నుంచి అయిదు రెట్లు అదనంగా అంటే టన్ను రూ.మూడు వేలకు కొనుగోలు చేస్తోందన్నారు.సొంత నిధులతోనే సాలీనా 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తికి అనుగుణంగా విస్తరణ జరిగిందన్నారు. కానీ పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయనీయకుండా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో యాజమాన్యం నష్టాలను సృష్టిస్తోందని విమర్శించారు. ఉక్కును ప్రైవేటీకరించాలన్న కేంద్రం ప్రకటనపై ఆంధ్రాలోని రాజకీయ పక్షాలన్నీ వ్యతిరేకమంటూ ప్రకటనలతో సరిపెడుతున్నాయనఆరు. ప్రత్యక్ష ఆందోళనకు దిగి, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలతో ప్రతిఘటించాలనికోరారు. ప్రజా ఉద్యమాల ద్వారా సాధించుకున్న ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కును ఇపుడు అదే ఉద్యమాలతో పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. ఐక్య ఉద్యమాలకు ప్రజలను సిద్ధం చేసే విధంగా కార్మిక వర్గం తమ కార్యాచరణలను నిర్మించుకోవాలని మహాసభను కోరారు. మహాసభలో స్టీల్‌సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, ప్లాంట్‌లోని వివిధ విభాగాల యూనియన్ కార్యదర్శులు, వివిధ పరిశ్రమల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



తాటితూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో జెసి విశ్వనాథన్

ప్రజాశక్తి -తగరపువలస : జిల్లాలో ధాన్యం కొనుగోలును వేగవంతం చేసి, గరిష్ఠంగా జనవరి 15లోగా పూర్తిచేయాలని వ్యవసాయ శాఖాధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ ఆదేశించారు. శుక్రవారం భీమిలి మండలం, తాటితూరు రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం సిద్ధం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఎంటియు 1121 ధాన్యం కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. గోనె సంచులు, రవాణా, హమాలీల ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని, ముందుగా రైతులు వీటిని చెల్లిస్తే, ధాన్యం ధరతోపాటు రైతు ఖాతాల్లో వీటిని కూడా జమచేస్తామన్నారు. తాటితూరులో 400 టన్నులు, మజ్జివలస క్లస్టర్‌లో 560 టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించినట్లు జెసి వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎస్ భాస్కరరెడ్డి, జెడిఎ కె.అప్పలస్వామి, ఎడిఎ బొడ్డేపల్లి విజయప్రసాద్, పౌర సరఫరాల శాఖ డిఎం, , తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎ.ఒ బి శివకోమలి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది స్వాతి, హరీష్, పంచాయితీ కార్యదర్శి శంకర్ జగన్నాథ్, విఆర్‌ఒ పాల్గొన్నారు.

ఆర్‌ఒపితో నవజాత శిశువులకు దృష్టి లోపం



డాక్టర్ మేఘా గులాటి

ప్రజాశక్తి - ఆరిలోవ : నవజాత శిశువులలో వచ్చే దృష్టి లోపానికి రెటినోపతి ఆఫ్ ప్రీమెచ్యూరిటీ (ఆర్‌ఒపి)తో ప్రధాన కారణమని, దీన్ని 30 రోజుల్లోగా గుర్తించి తగిన చికిత్స అందిస్తే దృష్టిలోపాన్ని నయం చేయవచ్చని జిఎంఆర్ వరలక్ష్మీ ప్రాంగణం, విట్రియో రెటీనా కన్సల్టెంట్ డాక్టర్ మేఘా గులాటి అన్నారు. నెలలు నిండకుండా, తక్కువ బరువుతో పుట్టి, ఎన్ఐసియూలో ఉన్న శిశువులను ప్రభావితం చేసే నేత్ర సంబంధిత వ్యాధే ఆర్‌ఒపి అన్నారు. సాధారణంగా శిశువులు ఈవ్యాధితో జన్మించరని, పుట్టిన రెండు,మూడు వారాల్లో ఆర్‌ఒపి వస్తుందన్నారు. కంటి లోపలి భాగం (రెటినా) పూర్తిగా అభివృద్ధి చెందకపోవడంతో పునరుద్ధరించలేని దృష్టి మాంద్యానికి దారితీస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌ఒపిపై తల్లిదండ్రులు, సంరక్షకులు, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సరైన సమయంలో రోగనిర్ధారణ, చికిత్స జరిగితే ఆర్‌ఒపి వలన వచ్చే పునరుద్ధరించలేని దృష్టి హానిని నివారించవచ్చన్నారు. నగరంలోని ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, జిఎంఆర్ వలర్ష్మీ ప్రాంగణంలో రెటినోపతి ఆఫ్ ప్రీమెచ్యూరిటీ నిర్వహణకు సమగ్ర, సంపూర్ణ సంరక్షణ అందిస్తుందన్నారు.

పలుచోట్ల సెమీక్రిస్మస్ సంబరాలు



సెయింట్ అలోసిస్ ఐటిఐలో క్రీస్తు సందేశానిస్తున్న ఫాదర్

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్‌లోని సెయింట్ అలోసిస్ ఐటిఐలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పేద విద్యార్థులకు వస్తు రూపంలో వితరణ చేపట్టారు. యాచకులకు భోజనాలు దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు ఫాదర్లు మతీవెంపల, జోసెఫ్ జడ్డు, విజాపటే, దేవరాయ, మర్యాద దాస్, అజయ్ కాటా పాల్గొన్నారు.

గాజువాక : 74వ వార్డు టిజిఆర్ నగర్ సచివాలయంలో రమేష్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్లో వార్డు కార్పొరేటర్, వైసిపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రమేష్ ఆధ్వర్యంలో పేదలు, వద్ధులకు పండ్లు రొట్టెలు, చీరలను వంశీరెడ్డి అందజేశారు. గొందేశి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

మధురవాడ : మాలతాంబ విద్యానికేతన్‌లో క్రిస్మస్ వేడుకల ఎన్ఎఫ్ఎస్.విద్యాసంస్థల అధినేత సునీల్ మహంతిప్రారంభించారు. విద్యార్థులు విభిన్న వేషధారణలతో చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పి.ఎం.రాజు, వైస్ ప్రిన్సిపల్ గాయత్రీదేవి పాల్గొన్నారు.

కంచరపాలెం : 53వ వార్డు పార్వతీనగర్ అన్నూర్ ప్లేస్కూల్‌లో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శాంతాక్లాజ్, దేవదూతల వేషధారణలో కనువిందు చేశారు. కేక్ కట్ చేసి చిన్నారులకు అందజేశారు. చిన్నారులకు బహుమతులు అందజేశారు. స్కూల్ కరస్పాండెంట్ షేక్ ఫరీద్, ప్రిన్సిపల్ షహరత్ బీబీ, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ విజేతలకు అభినందన



విజేతలైన విద్యార్థులు వీరే

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సన్ స్కూల్ వేదికగా నిర్వహించిన నెట్ బాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను శుక్ర వారం పలువురు అభినందించారు. అండర్-14 బాలికల విభాగంలో స్థానిక సన్ స్కూల్, ఎండాడ, జెడ్‌పి హైస్కూల్, భీమిలి సెయింట్ ఆన్స్ హైస్కూల్ విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అండర్-17 బాలికల విభాగంలో మధురవాడ గ్లోబ్ స్కూల్, భీమిలి సెయింట్ ఆన్స్ హైస్కూల్, భీమిలి సన్‌స్కూల్ విద్యార్థులు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.అండర్-14 బాలుర విభాగంలో మధురవాడ గ్లోబ్ స్కూల్, ఎండాడ జెడ్‌పి హైస్కూల్, భీమిలి సన్ స్కూల్ విజేతలుగా నిలిచారు. అండర్ -17 బాలుర విభాగంలో మధురవాడ గ్లోబ్ స్కూల్, భీమిలి సన్ స్కూల్, ఎండాడ , జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్లు ఎస్‌జిఎఫ్ నెట్‌బాల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లలిత్‌కుమార్, స్వరూపరాణి, సెక్రెటరీ సి హెచ్ వెంకట రెడ్డి తెలిపారు. వీరంతా వచ్చేనెల 11,12,13 తేదీల్లో నెల్లూరులో జరుగనున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు 12 మంది బాలికలు, బాలురు ఎంపికైన ట్లు నిర్వాహకులు తెలిపారు. సన్ స్కూల్ డైరెక్టర్ కె శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు పి శ్రీనివాస్, హెచ్ఎం అరుణ్‌కుమార్, మూడో వార్డు వైసిపి ఇంఛార్జి మైలపల్లి షణ్ముఖరావు అభినందించారు.

వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓటమి తథ్యం

- తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్

ప్రజాశక్తి -తగరపువలస : వచ్చే 2024 ఎన్నికల్లో వైసిపి ఓటమి తథ్యమని తెలుగుశక్తి అధ్యక్షులు బివి రామ్ జోస్యం చెప్పారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ఏకైక రాజధానిగా అమరావతి ఉండాలన్నదే ప్రజల ఆకాంక్ష అని, మూడు రాజధానులను రాష్ట్ర ప్రజలు కోరుకోవడం లేదన్నారు. శ్రీకాకుళం జిల్లా రాజాంలో తాజాగా టిడిపి అధినేత చంద్రబాబు సభ విజయవంతమే దీనికి నిదర్శనమని స్పష్టంచేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు నెలసరి జీతాలు సకాలంలో చెల్లించలేని దయనీయస్థితిలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్తారని దీమా వ్యక్తం చేశారు. సమావేశంలో టిడిపి విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి బోడేపూడి దొరబాబు, 8వ వార్డు పార్టీ బిసి సెల్ అధ్యక్షులు దువ్వి పరమేశ్వరరావు, సహాయ కార్యదర్శి డి వెంకటరమణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-యలమంచిలి

మూడురోజుల పాటు జరుగు రాష్ట్రస్థాయి 6వ అంతర్ జిల్లాల బాల బాలికల సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలను స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో శుక్రవారం ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు ప్రారంభించారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 26 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలన్నా, క్రీడాకారులన్నా తనకు చిన్న తనం నుంచే ప్రత్యేక గౌరవమని ఉందని తెలిపారు. క్రీడలు దేహదారుఢ్యానికే కాదని, గెలుపోటములను ఎదుర్కొనే మానసిక పరివర్తనకు కూడా దోహదం చేస్తాయని చెప్పారు. డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, ఎంపిపి బోదెపు గోవిందరావు, వైసిపి నాయకులు బొద్దపు ఎర్రయ్యదొర మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వందలాది మంది క్రీడాకారులకు ఆతిథ్యం ఇచ్చే బాధ్యత స్వయంగా ఎమ్మెల్యే తీసుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, వాలీబాల్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ప్రసాదరాజు, పైసా మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే



బంగారు పతకం చూపుతున్న గణేష్, డాక్టర్ ఖాసీం

ఇంటర్ స్టేట్ బాడీ బిల్డింగ్ పోటీల్లో
అయ్యన్న విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి-కె.కోటపాడు : విశాఖపట్నం బుల్లయ్య కాలేజీలో నిర్వహించిన ఆంధ్రా యూనివర్సిటీ ఇంటర్ స్టేట్ బాడీ బిల్డింగ్ పోటీల్లో స్థానిక అయ్యన్న డిగ్రీ కాలేజీ విద్యార్థి ఇమంది గణేష్ బంగారు పతకం సాధించారు. ప్రథమ స్థానం దక్కించుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గణేష్‌ను అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాసీం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది తమ కాలేజీ నుంచి ఇద్దరు విద్యార్థులు వెయిట్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికవడం గర్వించదగ్గ విషయమని చెప్పారు. గణేష్ మాట్లాడుతూ వచ్చే ఏడాది మహారాష్ట్రలో నిర్వహించనున్న జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలలో పాల్గొనున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు శివ

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈ నెల 23 నుంచి 25 వరకు పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు మండలంలోని మూలపేట గ్రామానికి చెందిన ఉప్పిలి శివ వెళ్లారు. సాయి మెన్స్ ఫిజిక్ క్రీడకు అర్హత సాధించిన శివను అనకాపల్లి జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అండ్ ఫిట్నెస్ సెంటర్ అధ్యక్ష కార్యదర్శులు అమరపల్లి కృష్ణాజీ, శిలపరశెట్టి బాబి అభినందించారు.



ఉప్పిలి శివ



రామస్వామినాయుడును అభినందిస్తున్న ప్రిన్సిపల్ రమణ

సిఎం వాలీబాల్ టోర్నమెంట్‌లో
గండి జట్టు విజయం

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక మదర్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు గండి రామస్వామి నాయుడు జట్టు సీఎం వాలీబాల్ టోర్నమెంట్‌లో విజయం సాధించినట్లు ఆ ప్రిన్సిపాల్ కె.రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో రామ స్వామి నాయుడు జట్టు కప్ గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామస్వామి నాయుడును పాఠశాలలో ప్రిన్సిపాల్, సిబ్బంది సత్కరించి అభినందించారు.

అగ్రి విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చోడవరం : బాపట్ల ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ బీఎస్సీలో 8వ ర్యాంకు సాధించిన మండలం దుడ్డుపాలెం గ్రామానికి చెందిన సుగుణకు రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. సుగుణ కుటుంబం ఆర్థికపరంగా వెనుకబాటుతో ఉన్న నేపథ్యంలో సాకేత్ ఫౌండేషన్, బిటి నాయుడు చారిటబుల్ ట్రస్ట్, ఫోరం ఫర్ బెటర్ తరపున ఈ మొత్తాన్ని శుక్రవారం స్థానిక ప్రేమ సమాజంలో అందించారు. విద్యార్థుల చదువు కోసం ఆర్థిక సహాయం అందిస్తున్న ఫారెస్ట్ రేంజర్ బి.రామ్ నరేష్, వర్మ, ఫోరం ఫర్ బెటర్ సభ్యులు బివిఎస్ ప్రసాద్, ప్రేమ సమాజం రాజు, రిటైర్డ్ ఆర్‌జెడి తిరుపతిరావు ఇందులో పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని వివిధ ప్రదేశాల్లో తలదాచుకుంటున్న నిరాశ్రయులకు స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. రైల్వే స్టేషన్, రింగ్ రోడ్డు, నెహ్రూ చౌక్, ఫుట్‌పాత్, డివైడర్‌లపై పడుకున్న నిరాశ్రయులు 50 మందికి దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు నీలేష్ గుప్తా, బల్ల శ్రీనివాసరావు, నిరీక్షణ కుమార్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

మండల సమావేశంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ



విద్యుత్‌శాఖ అధికారిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి- చోడవరం

అవినీతి రహితంగా అధికారులు సేవలు అందివ్వాలని, అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి పనికి డబ్బులు వసూలు చేస్తున్నారని సర్పంచ్‌లు ఫిర్యాదు చేయగా, విద్యుత్‌శాఖ ఏఈ, ఇతర సిబ్బందిపై సభలో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి దయనీయంగా ఉందని, కాంట్రాక్టర్ పనులు సక్రమంగా చేయకపోతే తమకు చెడ్డ పేరు వస్తుందని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల నిర్లక్ష్యం వల్ల జల్ జీవన మిషన్ ద్వారా గ్రామాల్లో మంచినీరు అందకుండా పోతుందని పలువురు సర్పంచులు నిలదీశారు. చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ ఉన్న డ్రైవర్ లేకపోవడంతో సేవలు అందడం లేదని సభ్యులు తెలిపారు. సభలో సభ్యులు అడిగిన ప్రతి సమస్యను వచ్చే జనరల్ బాడీ సమావేశానికి పూర్తి చేయాలని అధికారులను ధర్మ శ్రీ ఆదేశించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొత్తగా ఎన్నికైన ఏరువాక సత్యారావును ఎంపీటీసీలు, సర్పంచులు సన్మానించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఎంపీపీ గాడి కాసు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తహశీల్దారు బి.తిరుమల బాబు, ఎంపిడిఓ శ్యామ సుందర్, వైస్ ఎంపీపీలు బుద్ద గంగరాజు, కుమారి ఈశ్వరరావు, అధికారులు ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు

స్కూల్ గేమ్స్‌లో తుమ్మపాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- అనకాపల్లి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో రెండు నెలల పాటు నిర్వహించిన వివిధ పోటీల్లో తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. రాష్ట్రస్థాయి అండర్ 17 ఖోఖో పోటీల్లో జయవర్ధన్, రామ్ చరణ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి అండర్ 14 ఖోఖో బాలుర విభాగంలో కేకే లక్ష్మీధర్, బాలికల విభాగంలో లహరి, గీత, హేమన్వి తృతీయ స్థానాలు సాధించారు. జిల్లాస్థాయి అండర్-17 కబడ్డీ పోటీల్లో భాను ప్రకాష్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం ఎన్.శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ గొంతిన శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డివిఎన్‌కె.నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సమస్యలపై ఆర్టీసీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆర్టీసీ కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించడంతోపాటు ఇతర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ముందు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్షులు బి.వి.రావు, కార్యదర్శి పరమేశ్వరరావు, నాయకులు త్రిమూర్తులు, సలోమి మాట్లాడుతూ మిగిలిపోయిన 2,096 మంది కార్మికుల పే ఫిక్సేషన్ జరగాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, విద్యుత్ బస్సుల కోసం రాయితీలు ఆర్టీసీకే చెల్లించాలని, వైద్యాన్ని పునరుద్ధరించాలని కోరారు. మహిళా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, 12వ పిఆర్‌సి కమిషన్ నియమించి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరి నిరసనకు అద్దె బస్సు కార్మికులు సంఘీభావం తెలిపారు.



ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

తక్కువ వడ్డీతో రుణాలు

ప్రజాశక్తి-వడ్డాది : తక్కువ వడ్డీతో అందిస్తున్న ప్రత్యేక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిఏసిఎస్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు అన్నారు. వడ్డాది పిఏసిఎస్‌లో శుక్రవారం ఏడుగురికి ఎస్టీ అదర్స్ రుణాలు రూ.32.85 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.12.5 శాతం వడ్డీతో ఎకరాకి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే జనవరి నుండి ఎకరం లోపు ఉన్న చిన్న కారు రైతులకు కూడా ఈ రుణాలు మంజూరు చేస్తామన్నారు. తమ పిఏసిఎస్‌లో ధాన్యం కొనుగోలు ప్రారంభించామన్నారు. సెలవు దినాలలో కూడా రైతులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వీర్ల సురేష్, కుబిరెడ్డి వెంకట్రావు, వేతన కార్యదర్శి శాంతి పాల్గొన్నారు.

ముందస్తు సమాచారంతో
నిర్వాసితుల సమావేశం నిర్వహించాలని వినతి

ప్రజాశక్తి -మునగపాక రూరల్

అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులకు రెండు మూడు రోజులు ముందుగా రెవెన్యూ అధికారి ద్వారా సమాచారం ఇచ్చి సమావేశం ఏర్పాటు చేయాలని నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఎస్.బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రోడ్డు నిర్వాసితుల సంఘం సభ్యులతో కలిసి అనకాపల్లి ఆర్డీవో కార్యాలయ ఇన్‌ఛార్జి జయశ్రీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ ఈనెల 8న ఆర్డీవో చిన్నికృష్ణ గంట, రెండు గంటల ముందు అధికారికంగా సమాచారం లేకుండా అరకొర సమావేశం జరపడం వలన పరిహారం ఎంత ప్రకటించారనేది పూర్తిగా ఎవరికీ తెలియలేదన్నారు. పూర్తిస్థాయిలో నిర్వాసితులు లేని సమావేశంలో ప్రజా ఆమోదం లేకుండానే పరిహారం చెల్లింపు ప్రకటించడంతో అయోమయ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. నిర్వాసితుల సంఘం సభ్యుడు ఎవి.సత్యనారాయణ మాట్లాడుతూ నిర్వాసితులతో తదుపరి సమావేశం ఏ రోజు, ఏ సమయంలో, ఏయే గ్రామాల్లో ఏర్పాటు చేస్తారో పూర్తిస్థాయిలో సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గంగు నాయుడు, మళ్ల జయరాం, దొడ్డి సూర్య నారాయణ, లక్ష్మణరావు, కొయిలాడ సూర్యనారాయణ, మద్దుల రాజబాబు పాల్గొన్నారు.

25న యాదవ సంఘం పిక్నిక్

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఈనెల 25వ తేదీ ఆదివారం విశాఖ మధురవాడ జాతర శిల్పారం దగ్గర ఉమ్మడి విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనభోజనం (పిక్నిక్) నిర్వహిస్తున్నట్లు సంఘం చోడవరం నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు మొల్లి ప్రసాద్, గుద్దేటి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం వారు మండలంలోని పెదపూడి, పెద్ద మదిన, నేతవానిపాలెం తదితర గ్రామాల్లో యాదవ సంఘం ప్రతినిధులను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు.

తవ్వవానిపాలెంలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో అంతకాపల్లి పశు వైద్య కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆర్థిక సహాయంతో శుక్రవారం ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ బోకం స్వామి నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఒ బి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ శిబిరంలో 30 కట్టుకు రాని పడ్డలు, పాడి పశువులకు చికిత్స, చూడి తనిఖీలు, అనారోగ్యంతో ఉన్న పశువులకు వైద్యం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా వెటరినరీ హాస్పిటల్ సహాయ సంచాలకులు డాక్టర్ కె.ఉషా కుమారి, పశువైద్యులు డాక్టర్ జి.అరుణ, డాక్టర్ బి.సౌజన్య, శంకర్, శివ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి- దేవరాపల్లి : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తాతారావు అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు కోరుప్రోలు శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని రైవాడ కస్తూరిబా బాలికల పాఠశాలలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ఇష్టపడి చదవాలని, మనిషి జీవితాలను మార్చే శక్తి ఒక చదువుకే ఉంటుందని తెలిపారు. పేదవారి కుటుంబాలలో మార్పు రావాలంటే చదువుతోనే సాధ్యమన్నారు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కెవి.రమణ మాట్లాడుతూ ఆడపిల్లలకు చదువుకు మొట్టమొదటిగా సావిత్రిబాయి పూలే బాటలు వేశారని, ఆడవారికి మగవారితో సమానంగా రాజ్యాంగంలో హక్కులు కల్పించింది అంబేద్కర్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శశి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు హెచ్ఐవి పరీక్షలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని కోయలపల్లి గ్రామంలో జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ ఆధ్వర్యాన గర్భిణులకు హెచ్ఐవి పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌పి గోవిందరావు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించి, అవగాహన పెంచాలన్నారు. అనంతరం గ్రామస్తులకు హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ సీత పైడినాయుడు, అంగన్‌వాడి కార్యకర్త జయలక్ష్మి, ఆశ వర్కర్ నాగమణి, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ పట్నాల దీప, దేవి పాల్గొన్నారు.

ఫార్మా నిర్వాసితుల వినతి

ప్రజాశక్తి - పరవాడ : రాంకీ ఫార్మాసిటీ భూ నిర్వాసిత గ్రామాల సమస్యలపై వైసిపి మాజీ మండల అధ్యక్షులు బొద్దపు చిన్నారావు శుక్రవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు విన్నవించారు. స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలని, రాంకీ ఫైర్ స్టేషన్‌లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఎన్నో సంవత్సరాలుగా కంపెనీల్లో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు ఉప్రతి ఏటా ఇంక్రిమెంట్ రూ.5000, బోనస్ ఇవ్వాలని, కంపెనీ ఉద్యోగులుగా పరిగణించాలని, సిఇటిపి సివిల్ విభాగంలో పురుషులతో సమానంగా మహిళలకు వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి కల్పించని నిర్వాసితులకు జీవనోపాధి నిమిత్తం ప్రతి ఇంటికి నెలకు రూ.10వేలు చొప్పున రాంకీ యాజమాన్యం చెల్లించాలని, ఫార్మా వ్యర్థాల వల్ల పలు వ్యాధులు బారిన పడి మృత్యువాత పడిన కుటుంబాలకు నష్ట పరిహారం లేదా ఆయా కుటుంబాలకు జీవనోఉపాధి కింద నెలకు రూ.20 వేలు రాంకీ యాజమాన్యం కోరారు. తాడి గ్రామాన్ని తరలించాలన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- కె.కోటపాడు : అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధి ఉన్న పలు అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసిడిఎస్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కసింకోట మండలంలో 2, ఎలమంచిలిలో 2, సబ్బవరంలో 3 కార్యకర్తల పోస్టులు, కసింకోటలో10, రావికమతంలో 10, కె.కోటపాడులో 5, ఎలమంచిలిలో 8, సబ్బవరంలో 5 ఆయా పోస్టులు, ఎలమంచిలిలో 1 మినీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ నెల 26 నుండి జనవరి 5వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

వాయిద్య కళాకారుల సంఘం ఉపాధ్యక్షులుగా నానాజీ

ప్రజాశక్తి-చోడవరం : జాతీయ వాయిద్య కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడిగా చోడవరంకు చెందిన రాయవరపు నానాజీ నియామకమయ్యారు. శుక్రవారం హైదరాబాదులో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో నానాజీని నియామకం చేశారు. అనంతరం ఎన్నికైన సభ్యులతో పాటు నానాజీని తెలంగాణ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ సమక్షంలో సన్మానించారు. నానాజీ చోడవరంలో త్యాగరాజ సంగీత పాఠశాల ద్వారా ఉచితంగా విద్యను అందిస్తున్నారు. నానాజీ నియామకం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

రైతుల సమస్యలను పరిష్కరించకుంటే సీఎం పర్యటనను అడ్డుకుంటాం

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



వినతిపత్రం ఇస్తున్న అయ్యన్న, రాజు, అనిత తదితరులు

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్

రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 28న నర్సీపట్నంలో సీఎం జగన్ పర్యటనను అడ్డుకుంటామని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ఆధ్వర్యంలో నర్సీపట్నంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. సిబిఎం కాంపౌండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పోలీస్ స్టేషన్, అబీసెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ పండించే పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. భూములు గుర్తించి దోచుకోవ డానికే భూముల రీ సర్వే చేపడుతున్నారని విమర్శించారు. సీఎం జగన్ ఫొటోలతో పాసు పుస్తకాలు ఇవ్వడం సిగ్గు చేటన్నారు. అనంతర చోడవరం మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయడులు మాట్లాడారు. ఆర్డీవో కార్యాలయంలో ఏఒ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.

నక్కపల్లి : మండలంలోని దేవవరం గ్రామంలో సీఈఒ గింజాల అప్పారావు, సర్పంచ్ రాఘవ కుమారి ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌డిఎఫ్‌సి పాయకరావుపేట బ్రాంచ్ మేనేజర్ వెంకట్, సిబ్బంది రైతులను సన్మానించారు.

ఉత్తమ రైతులకు సన్మానం

కె.కోటపాడు : జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మండలంలోని చౌడువాడ గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం సర్పంచి దాడి ఎరుకునాయుడు ఆధ్వర్యంలో ఉత్తమ రైతులను సన్మానించారు. చౌడువాడ శివారు చిరికివాని కళాలకు చెందిన చిరికి చిన్నమనాయుడు, చౌడువాడ గ్రామానికి చెందిన తనకల రాంబాబు సేంద్రియ ఎరువులు వాడకం, వ్యవసాయంలో యాత్రికరణ, నూతన వంగడాలు ఉపయోగించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వచ్చే విధంగా వ్యవసాయం చేస్తుందన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచి ఎరుకునాయుడు మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయిన రైతు నేడు ప్రభుత్వ విధానాల వలన అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ తనకల అప్పలనాయుడు, పంచాయతీ సిబ్బంది ఏడుపాక సత్యనారాయణ, జ్యోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రైతును సన్మానిస్తున్న సర్పంచ్ ఎరుకునాయుడు



చరణ్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

రబీలో సాగు విస్తీర్ణం పెంచాలి

అనకాపల్లి : జిల్లాలో రబీ పంటల సాగు విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికె.జగన్నాథరావు అన్నారు. భారత మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతి సందర్భంగా ఆర్ఎఆర్ఎస్‌లో జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో లాభదాయకమైన అపరాలు, చిరుధాన్యాలు, నువ్వులు, వేరుశనగ, మొక్కజొన్న వంటి పంటలు వేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్ రావు మాట్లాడుతూ జిల్లాలో అనధికారికంగా రైతులు రబీ సీజన్లో 50 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారని, దీనిని వ్యవసాయ అధికారులు నమోదు చేసి అధికారికంగా ధ్రువీకరించాలని ఆదేశించారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఆశా దేవి మాట్లాడుతూ భీమిలి ప్రాంతంలో చిరుధాన్యాల విస్తీర్ణం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ రమణ మూర్తి, విశాలాక్షి, రామలక్ష్మి, భవాని సరిత, విస్తరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

ప్రజాశక్తి-అనకాపల్లి

వినియోగదారుల హక్కుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అన్నారు. స్థానిక రోటరీ క్లబ్‌లో శుక్రవారం వినియోగదారుల హక్కుల పరిరక్షణ వారోత్సవం సందర్భంగా వినియోగదారులు, కమిషన్లలో సమర్ధవంతంగా పరిష్కరించడం అనే అంశంపై ఆమె మాట్లాడారు. వివిధ రకాల వస్తువులు, ఉపకరణాలు, ఆహార పదార్థాలపై ముద్రించిన కనీస ధరలు, ఉపయోగించే ఆఖరు తేదీ వంటి అంశాలపై అవగాహన ఉండాలని సూచించారు. అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నప్పటికీ వినియోగదారులకు సరైన న్యాయం జరగలేదన్నారు. వినియోగదారుల కోర్టు జడ్జి వెంకటేశ్వరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత వినియోగదారులు తమ హక్కులను తెలుసుకోవడంలో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ శారద బాయి, డీఎస్ఓ ప్రసాద్, జిల్లా వృత్తి విద్య అధికారి, లీగల్ మెట్రాలజీ అధికారి రంగారెడ్డి, తహశీల్దారు గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'



మహిళకు కరపత్రం ఇస్తున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-కశింకోట : మండల కేంద్రం కశింకోటలో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండో రోజు శుక్రవారం కూడా నిర్వహించారు. వీధి కాలువలు, విద్యుత్ సౌకర్యంలో ఉన్న లోపాలను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పిసినికాడ ఎస్సీ కాలనీ శ్మశాన వాటిక ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేన్సర్‌తో కొద్ది రోజుల క్రితం మరణించి లెంక ప్రవీణ్ కుమార్ వైద్యానికి భారీ మొత్తంలో ఖర్చు అయిందని, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం అందించాలని మంత్రిని బాధితులు కోరారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, గున్నయ్య నాయుడు, జడ్పీటీసీ దంతులూరి శ్రీధర్ రాజు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి శ్రీనివాస్, సర్పంచ్ మంత్రి జయరజని, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు మళ్ల బుల్లిబాబు, పలకా రవి, మలసాల కిషోర్, ఉప సర్పంచ్ నడిపల్లి లక్ష్మినాయుడు, ఎంపీటీసీలు యల్లపు నూకరత్నం, చేవెట్టి చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది : మండలంలోని విజయరామరాజుపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ శుక్రవారం 2వ రోజు కొనసాగించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అమలపై అరా తీశారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు కషి చేస్తానని ఆయన తెలిపారు. ఆర్ఎస్ ఛానల్ పూడికతీత చేపట్టాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దొండా రాంబాబు, వైస్ ఎంపిపి దొండా లలితా నారాయణ మూర్తి, సర్పంచ్ విజయకుమార్, ఎంపీటీసీ బాలకృష్ణ, వైసిపి మండల అధ్యక్షుడు కె.అచ్చం నాయుడు, తహశీల్దారు అంబేద్కర్, ఎంపీడీవో సువర్ణ రాజు పాల్గొన్నారు.

శివ శివాని పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని ఉక్కునగరం సెక్టార్ 9లో ఉన్న శివ శివాని పబ్లిక్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాస్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫెయిత్ ఆధ్వర్యాన....

కె.కోటపాడు : మండలంలోని శృంగవరం పంచాయితీ పరిధి కొత్త భూమి గ్రామంలో గ్రీస్ ఫెయిత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యాన శుక్రవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు కేక్ కట్ చేశారు. అనంతరం సంఘం తరుపున పైలా ప్రసాదరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జాన్ ప్రకాష్ రాజు, పైలా యువసేన నాయకులు సిమ్మ ప్రసాద్, సింగంపల్లి స్వామి, కింతాడ మాజీ సర్పంచ్ బండారు నరసింహ నాయుడు, పాస్టర్ సాల్మన్ రాజు పాల్గొన్నారు.

వన సమారాధనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : సత్యనారాయణపురం హేమగిరి సత్యనారాయణ దేవస్థానం మామిడి తోటలో ఈనెల 25న జరిగే తూర్పు కాపు సంక్షేమ సంఘం వన సమారాధనను విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షులు పలక రాము, ప్రధాన కార్యదర్శి ఎడ్ల త్రినాధరావు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ వన సమారాధనకు ముఖ్య అతిథులుగా మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, అవంతి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కరణం ధర్మ శ్రీ, మాజీ ఎమ్మెల్యేలు, సుమారు 7500 మంది తూర్పు కాపు కుటుంబీకులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పలక సత్యనారాయణ, శ్రీరామదాసు గోవిందరావు, నడిపల్లి గణేష్, కర్రి బాబి, శివ, సకల గోవిందు, గొన్నాబత్తుల వెంకటరమణ పాల్గొన్నారు.

27లోపు అభ్యంతరాలు తెలపండి

ప్రజాశక్తి- కశింకోట : వైఎస్ఆర్ ఆసరా పథకంలో భాగంగా 3వ విడత సోషల్ ఆడిట్ నిమిత్తం అర్హత గల స్వయం సహాయక సంఘాలు సభ్యుల వివరాలను గ్రామ సచివాలయ నోటీసు బోర్డు ప్రదర్శిస్తున్నామని, అభ్యంతరాలుంటే ఈ నెల 27 లోపు వెలుగు సిబ్బందికి ఇవ్వాలని వెలుగు ఎపిఓ ఎం.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సచివాలయ సిబ్బందికి జాబితాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 20 సచివాలయంలో ప్రదర్శన నిమిత్తం టాగ్ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కశింకోట పంచాయతీ అధికారి రమేష్, సీసీ సత్యనారాయణ, విఓఏలు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

-ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలయుడు
-పలు పాఠశాలల్లో ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబులను ఇస్తున్న బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-చీడికాడ:విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేయడం జరిగిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలయుడు తెలిపారు. మండలంలోని మంచాల గ్రామంలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతికంగా అభివృద్ధి చెంది భవిష్యత్తులో మంచిగా స్థిరపడి కుటుంబాలను ఉన్నత స్థాయిలో నిలబెట్టాలన్నారు.ఈ సదుద్దేశంతోనే జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులకు వీటిని అందిస్తున్నారన్నారు.మండలంలో 532 మందికి ట్యాబ్‌లన అందజేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొరచా జయమ్మ నారాయణమూర్తి, జడ్పిటిసి శారద వరలక్ష్మి జానకిరామ్, తహసీల్దార్ బీవి రాణి, ఓఎస్‌డి పోలి నాయుడు, పార్టీ కన్వీనర్ రాజబాబు, యూత్ అధ్యక్షుడు స్వామి నాయుడు పాల్గొన్నారు

కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని జెడ్పిటిసి ఉమాదేవి తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల వద్ద ఎంఈఓ అప్పారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్యాబ్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాఠశాలలో అన్ని వసతులు అదేవిధంగా సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. వైస్ ఎంపీపీ దత్తుడు రాజు మాట్లాడుతూ, విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి పి.అప్పారావు మాట్లాడుతూ, మండలానికి 180 ట్యాబులు వచ్చాయని, ప్రభుత్వ పాఠశాలకు 81, గర్ల్స్ హైస్కూల్ కు 63, కేజీబీవీకి 24 ట్యాబులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు సత్తిబాబు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, విద్యా కమిటీ అధ్యక్షులు నిమ్మల గొల్లబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: పెద్ద బొడ్డేపల్లి ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ట్యాబ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాల్మన్ రాజు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో ఇస్తున్న ఎమ్మెల్యే గణేష్

నక్కపల్లి:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే గొల్ల బాబురావు ట్యాబ్‌లు పంపిణీని ప్రారంభించారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యా రంగానికి పెద్దపీట వేస్తూ సమూలమైన మార్పులు తీసుకువచ్చారని అన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ డివిడి ప్రసాద్, హెచ్ఎం రాణి లలిత, ఎంపీపీ రత్నం, సర్పంచ్ జయ రత్న కుమారి, జెడ్పిటిసి కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఈశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ పద్మ, పిడి రాజు, వైసిపి నాయకులు శీరం నరసింహామూర్తి, శేషరత్నం, యలమంచిలి తాతబాబు, చందరావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండలంలోని 8వ తరగతి విద్యార్థులకు చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చేతుల మీదుగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు బైజూస్ ద్వారా విద్యాబోధనకు ఉపకరించే విధంగా ట్యాబులను పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాకారపు నాగేశ్వరి దేవి, జడ్పిటిసి దొండ రాంబాబు, తహశీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సువర్ణరాజు, వైసిపి మండల అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చం నాయుడు, పలువులు ప్రజాప్రతినిధులు, హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు చేతుల మీదుగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన పలు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను ఎమ్మెల్యే తిలకించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, నాయకులు కోన బుజ్జి, కె విమల నాయుడు, పంచదారల పైడిరాజు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న నాగేశ్వరరావు

నాగేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి-నక్కపల్లి:విజయవాడ పిబి సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగిన 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల చరిత్ర అధ్యాపకులు కాపారపు నాగేశ్వరరావు హాజరయ్యారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం, ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సంఘం ప్రతినిధుల ఆహ్వానం మేరకు కాపారపు నాగేశ్వరరావు హాజరై సాహితీ, సాంస్కృతిక సదస్సులో పాల్గొని తన ప్రతిభను చాటుకున్నారు. తెలుగు భాష ప్రాధాన్యత, భాష సంరక్షణ అంశాలపై మాట్లాడారు. ఈ మేరకు సంఘం ప్రతినిధులు నాగేశ్వరరావును సత్కరించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.



గ్రామంలో పర్యటిస్తున్న అనిత

గ్రామాల్లో అనిత పర్యటన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని దోసలపాడు ,ముకుందరాజుపేట గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో నిత్యావసర సరుకులతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలు నింగి నంటాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు గింజల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. .

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని శరభవరం సచివాలయ పరిధిలో లోసింగి ఆర్ల, గుర్రాల బయలు, గదబూరు, రామన్నపేట గ్రామాల్లో ఈ నెల 24న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైసిపి మండల నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం దర్మశ్రీ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

పథకాల అమలుపై ఆరా

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:గ్రామాల్లో సమస్యలను నేరుగా పరిశీలించి సత్వర న్యాయం చేకూర్చడమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉద్దేశ్యమని పాయకరావుపేట శాసన సభ్యులు గొల్ల బాబురావు అన్నారు. శుక్రవారం మండలంలోని పెదగుమ్ములూరు సచివాలయం పరిధి ల సీతారాంపురం, నీలాద్రిపురం, పెదగుమ్ములూరులో పర్యటించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, బడుగు బలహీన, మైనారిటీ వర్గాల వారందరికీ అనేక ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. సమస్యలను త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

భారీ తాచుపాము హతం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల గ్రామంలో పొలంలో సంచరిస్తున్న 10 అడుగుల తాచుపామును శుక్రవారం రైతులు హతపర్చారు. చెరువు వద్ద గ్రామానికి చెందిన నల్లల రామకృష్ణ పొలంలో రైతులు వరి కుప్ప వేస్తుండగా, గట్టుపై ఉన్న 10 అడుగుల తాచు పామును చూసి రైతులంతా భయ భ్రాంతులకు గురయ్యారు. ఎట్టకేలకు రైతులు అంతా కలిసి పామును కర్రలతో కొట్టి హతమార్చారు.



హతమైన పాము



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

26న కాపునాడు మహాసభ

ప్రజాశక్తి-రావికమతం:వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా విశాఖ ఎంవిపి కాలనీలో ఏఎస్ రాజా గ్రౌండ్‌లో 26న చేపట్టే కాపునాడు మహాసభకు కాపు సోదరులు తరలి రావాలని రాధా రంగా ఆర్గనైజషన్ అధ్యక్షుడు గదే బాలాజీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తూర్పు కాపు సంక్షేమ శాఖ గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ, వంగవీటి మోహన రంగా కాపుల అభ్యున్నతికి పని చేశారని కొనియాడారు. కాపులందరూ అన్ని రంగాలలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రావికమతం సర్పంచ్ గెంజి మోది నాయుడు, కవగుంట సర్పంచ్ దాసరి వరహాలు, మాజీ ఎంపీటీసీ గంజి వెంకటరమణ, పులగాయల సత్యనారాయణ, రొక్కం వెంకటేష్, కోసిరెడ్డి గౌరీశ్వరావు, ముక్క రామసూరి పాల్గొన్నారు.

గిరిజనులకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-కొత్తకోట:క్రిస్మస్ పండగ సందర్భంగా రావికమతం మండలం ధర్మవరం జోష్ మిషన్ క్లినిక్ (ధర్మాసుపత్రి)డైరెక్టర్ కె.వర్గీష్ ఆర్థిక సాయంతో పలువురు గిరిజన నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణి చేశారు. ఈ మేరకు శుక్రవారం ధర్మవరం, సికాయిపాడు, చలిసింగం గ్రామాలకు చెందిన సుమారు 150 కుటుంబాలకు 25 కేజీల బియ్యం, పప్పులు, ఫారమ్ కోడి తదితర సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డైరెక్టర్ వర్గీష్ మాట్లాడుతూ, ఏసుక్రీస్తు జన్మదిన వేడుకల సందర్భంగా కొంత మంది నిరు పేదల కైనా సాయం అందించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం ప్రతిఏటా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.
గత ఏడాది కాలంగా తమ జోష్ మిషన్ ఆసుపత్రి ద్వారా పేదలకు వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్చార్జ్ వాసవి, ధర్మవరం గ్రామ సర్పంచ్ రాజేశ్వరి అప్పారావు, ఉప సర్పంచ్ పల్లా సింహాద్రి, నీలాపు నూకరాజు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..



సరుకులు పంపిణీ చేస్తున్న వర్గీస్

సందడిగా ధనుర్మాసోత్సవాలు

ప్రజాశక్తి-పాయకరావుపేట:పట్టణంలో రాధా రుక్మిణి పాండురంగ స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు ఈవో వెంకట్రాది ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు గొల్ల బాబురావు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లంక సూర్యనారాయణ, పాయకరావుపేట సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు దనిశెట్టి బాబురావు, ఎంపీపీ పార్వతీ తాతారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గుటూరు శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, కేసన్ కుర్తి సత్తిబాబు, దనిశెట్టి బాబి పాల్గొన్నారు.

నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు శుక్రవారం ఆంజనేయ వాహనంపై శ్రీనివాసుడిని ఊరేగించారు. అర్చక బృందం గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, సంకర్షణపల్లి రాజగోపాల కృష్ణమాచార్యులు, భాగవతం గోపాల చార్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆంజనేయ వాహనం లోనూ, గోదాదేవి అమ్మ వారిని పల్లకిలోనూ తిరువీధి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



ఊరేగిస్తున్న అర్చకులు

ఆకట్టుకున్న సంకీర్తనలు

ప్రజాశక్తి-గొలుగొండ:భగవాన్ శ్రీసత్య సాయి బాబా ఏజెన్సీ లక్ష్మీపురం భజన మండలి ఆధ్వర్యంలో లింగంపేట దరి గైరంపేట గ్రామంలో శుక్రవారం తెల్లవారు జామున గ్రామ సంకీర్తన చేపట్టారు. సత్య సాయి కీర్తనలు ఆలపిస్తూ గ్రామమంతా కలియ తిరిగారు. కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కొంతమంది నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాయి భక్తులు పాల్గొన్నారు.

చెత్తపన్నుపై సిబ్బందిని ఉసిగొల్పడం తగదు

-ప్రజలంతా వైసిపి చర్యలను ప్రతిఘటించాలి
-బలవంతపు వసూళ్లను తిప్పికొట్టాలి
-సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు



మాట్లాడుతున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, చిత్రంలో గంగారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి పాలకవర్గం చెత్తపై యూజర్ ఛార్జీల వసూళ్ల కోసం సచివాలయ సిబ్బందిని, స్వయం సహాయక బృందాల ఆర్‌పిలను ప్రజలపైకి ఉసిగొల్పే చర్యలను సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు మద్దిలపాలెంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు ఎక్కడికక్కడ వైసిపి బలవంతపు చర్యలను ఐక్యంగా ప్రతిఘటించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల సచివాలయ శానిటరీ సెక్రటరీలపై ఒత్తిడి పెంచి చెత్తపై యూజర్ ఛార్జీల వసూళ్లకు బలవంతం చేశారని, ఒత్తిడి తట్టుకోలేక జోన్-4లో ఒక శానిటరీ సెక్రటరీ గుండెపోటుతో మరణించారని తెలిపారు. చెత్తపై యూజర్ ఛార్జీలు వసూలు చేయబోమని సచివాలయ శానిటరీ సెక్రటరీలు ఆందోళన కూడా చేశారని గుర్తు చేశారు. గత రెండు రోజుల నుంచి ఎస్‌హెచ్‌జిల ఆర్‌పిలను ప్రజల నుంచి చెత్త యూజర్ ఛార్జీల వసూలు చేయాలని అధికారులు బలవంతం చేస్తున్నారన్నారు. రోజువారీ టార్గెట్‌లను నిర్ణయించి వసూళ్లు చేయకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. ఎస్‌హెచ్‌జి గ్రూపుల్లో చెత్త ఛార్జీల వసూళ్లపై తీర్మానం చేసి ప్రతినెలా ఎస్‌హెచ్‌జి గ్రూపుల నుంచి వసూలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. యూజర్ ఛార్జీలు చెల్లించకపోతే గ్రూపుల నుంచి తొలగించండని ఆదేశాలిస్తున్నారని తెలిపారు. ప్రతి నెలా వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్ల నుంచి బలవంతంగా చెత్త యూజర్ ఛార్జీలు కోత విధిస్తున్నారని తెలిపారు. యూజర్ ఛార్జీలు చెల్లించకపోతే పెన్షన్ రద్దు చేస్తామని బెదిరించడం దారుణమని అన్నారు. అపార్ట్‌మెంట్లు, ఇళ్ల వద్దకు వెళ్లి చెత్త యూజర్ ఛార్జీలు చెల్లించకపోతే నీటి కుళాయిలు తొలగిస్తామని, చెత్త తీసుకువెళ్లబోమని బెదిరిస్తున్నారన్నారు. చెత్తపై యూజర్ ఛార్జీలను ప్రజలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. క్లీన్ ఎపి కింద తీసుకొచ్చిన వాహనాలు కాంట్రాక్టర్ లాభాల కోసమేనన్నారు. చాలా క్లాప్ వాహనాలు మూలనపడుతున్నాయని తెలిపారు. జివిఎంసి అవినీతి భాగోతాలు రోజుకొకటి వెలుగు చూస్తున్నాయన్నారు. వాహనాలు, వాకీటాకీల కొనుగోళ్లు, ప్రధాన మంత్రి పర్యటన, నేవల్ డే తదితర కార్యక్రమాల నిర్వహణలో అక్రమాలు జరిగాయన్నారు. రోడ్లు, భవనాల ప్లాన్లు, కోడి వ్యర్థాలు.. ఇలా అన్నింటిలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, జిల్లా కమిటీ సభ్యులు పి.పైడిరాజు పాల్గొన్నారు.


ఎంపిడిఓ తో మాట్లాడుతున్న శిరీషారాణి

సంపద తయారీ కేంద్రాన్ని పూర్తి చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లిలో సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి సూచించారు. షెడ్లు నిర్మాణం పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. నిర్మాణం పనుల పై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో నక్కపల్లి, కశింకోట, సబ్బవరంలో ఏర్పాటు చేస్తున్న సంపద తయారీ కేంద్రాలను శిక్షణ కేంద్రాలుగా మార్చి చెత్త నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 8 మండలాలకు సంబంధించి చెత్త నిర్వహణపై ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.శిక్షణ పై అవగాహన కోసం విజయవాడలో జరిగే తరగతులకు హాజరుకా వాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు సూచిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, ఎంపిడిఓ సీతారామరాజు, ఈఓపిఆర్డి వెంకట నారాయణ, పంచాయతీ ఉపసర్పంచ్ వీసం రాజు పాల్గొన్నారు.


రత్నంకు ప్రశంసా పత్రం, నగదు ఇస్తున్న మురళీధర్

వ్యాసరచన పోటీల్లో రత్నం ప్రతిభ

ప్రజాశక్తి-నక్కపల్లి:అనకాపల్లిలో కన్స్యూమర్స్ ఎఫైర్స్ ఫుడ్ అండ్ సివిల్ సప్లయర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ విద్యార్థి టి.రత్నం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి మురళీధర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మూడు వేల రూపాయల నగదును రత్నంకు అందజేశారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ కె.శైలజ, అధ్యాపకులు రత్నం కు అభినందనలు తెలిపారు.

పాఠశాలలో పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పాయకరావుపేట:పట్టణంలోని ఇందిరా కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోటీ 25 లక్షలతో చేపట్టే తరగతి గదుల పనులను శుక్రవారం శాసనసభ్యులు గొల్ల బాబురావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ నాడు నేడు పనులకు వేలాది కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారని తెలిపారు. విద్య, వైద్యానికి ఎన్నడు లేని విధంగా ఖర్చు చేస్తున్నారన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వెల్నెస్ హెల్త్ కేంద్రాన్ని శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లంక సూర్యనారాయణ, సర్పంచ్ గార ఉషాశ్రీ ప్రసాద్, ఎంపీపీ పార్వతీ తాతారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గుటూరు శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు దనిశెట్టి బాబురావు, పట్టణ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, కో ఆప్షన్ సభ్యులు కాదా రామకృష్ణ, ఎంపిడివో సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వార్డ్ మెంబర్లు, దనిశెట్టి బాబి, తాటిపాక లావరాజు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

సమస్యలపై ఎస్‌డబ్ల్యుఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆర్‌టిసి ఉద్యోగుల బకాయిలను తక్షణం చెల్లించాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అధికారి కార్యాలయం వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు పి.సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎంపిహెచ్.అప్పడు, జిల్లా కార్యదర్శి ఎ.సీతాలక్ష్మి మాట్లాడారు. పెండింగ్‌లో పెట్టిన ఓటి, నైటౌట్, డే అవుట్ అలవెన్సుల బకాయిలను రోజు వారీ క్యాష్‌లో నుంచి చెల్లించాలన్నారు. 2017 సంవత్సరం పే ఏరియర్స్ బకాయిలను, ఎస్‌బిటి, ఎస్‌ఆర్‌బిఎస్ మొత్తాలను 2020-21, 2022-23 లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఇహెచ్ఎస్ స్థానంలో పాత ఆర్‌టిసి వైద్య విధానాన్ని పునరుద్ధరించి అకాల మరణాలను ఆపాలన్నారు. మరో పక్క సంవత్సరాల తరబడి పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రిక్రూట్‌మెంట్ నిర్వహించి కార్మికులపై పని భారం తగ్గించాలని, అద్దె బస్సులను రద్దు చేసి వాటి స్థానంలో ఆర్‌టిసి బస్సులు కొనుగోలు చేయాలని అన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను కన్సార్టియం ద్వారా కాకుండా ఆర్‌టిసియే నేరుగా ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. వెహికల్ కండిషన్ దిగజారి ప్రమాదాలు ఎక్కువయ్యాయని, దీనిని నివారించడానికి కొరత ఉన్న గ్యారేజీ సిబ్బందిని పెంచాలని కోరారు. నాణ్యమైన స్పేర్‌పార్ట్స్ సకాలంలో వేయకపోవడం వల్ల జరిగే ప్రమాదాలకు సూపర్‌వైజర్లును బాధ్యులను చేయడం సరికాదన్నారు. మహిళా కండక్టర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో స్వామి, కెఆర్.కుమార్, చలపతి, నాయుడు, డివి.రెడ్డి, ముత్యాలమ్మ, ఎస్ఎజి. ప్రసాద్, రామారావు, ఇవిఎన్.రాజు పాల్గొన్నారు.



ధర్నా చేపడుతున్న సంఘం నాయకులు

పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలు


నృత్యం చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి - పాయకరావుపేట:పట్టణంలోని కనోస ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ప్రిన్సిపాల్ సిస్టర్ సోఫియా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, క్రీస్తు పుట్టుక సర్వ మానవాళికి సంతోషకరమన్నారు. సంఘంలో మహిళలు, విద్యార్థులు ఆదర్శవంతమైన జీవితాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేకమైన కీర్తనలు ఆలపించారు. అనంతరం క్రిస్మస్ కేకు కట్ చేసి బహుమతులను విద్యార్థులకు అందజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, మేరీ, అలెక్స్, పిటి శ్రీను పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురం మేజర్ పంచాయతీ సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ లోచల సుజాత జ్యోతి ప్రజ్వలన చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సెయింట్ ఆన్స్ పాఠశాలలో మంచి ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెయింట్‌ఆన్స్ స్కూల్ డైరెక్టర్ పాల్‌అమల్, కరస్పాండెంట్ జాన్ సుశియా మాణిక్యం, ప్రిన్సిపల్ సైమన్ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న సర్పంచ్, డైరెక్టర్,


పరిశీలిస్తున్న ఎంఇఒ

కెజిబివిలో మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట కెజిబివి విద్యాలయంలో ఎంఇఒ సాయిశైలజ మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు అందుతుందా లేదా అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన పథకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒ తులసి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.